క్లుప్తంగా

లాల్ బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

లింగోజిగూడ: నిస్వార్థంగా ప్రజాసేవలో తరించిన ఆదర్శప్రాయుడు భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి అని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సోమవారం ఎల్‌బీనగర్‌లోని వార్డు కార్యాలయం వద్ద శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ అధ్యక్షులు మల్లారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ రెడ్డికి గాంధీ సేవ పురస్కారం



గాంధీ సేవ పురస్కార్ అవార్డు అందుకుంటున్న నరేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి గాంధీ సేవ పురస్కార్–2023 అవార్డును అందుకున్నారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. ఈ అవార్డు పొందడం ద్వారా సామాజిక బాధ్యత రెట్టింపు అయిందని తెలిపారు.

అనాథ విద్యార్థి గృహానికి నిత్యావసర సరుకులు పంపిణీ

నాగోలు: ప్రపంచ వృద్ధుల దినోత్సవం, మహాత్మాగాంధీ, శాస్త్రీ జయంతి సందర్భంగా నాగోలులోని చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బండ్లగూడలోని లాలన అనాథ విద్యార్థి గృహం, వయోధికుల ఆశ్రమంలో చిమ్మపూడి ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ మూర్తి, మురళీ కృష్ణ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటలు, పద్యాలు పాడి అలరించారు. కార్యక్రమంలో లాలన ఫౌండేషన్ నిర్వాహకులు మాధవి, స్వాతంత్ర సమర యోధులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా క్రాంతికుమార్



నాగోలు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) బీహార్ రాష్ట్రం బోగుసెరైలో జరిగిన 30వ జాతీయ మహాసభల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన గ్యార క్రాంతికుమార్‌ను జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యులుగా అవకాశం కల్పించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

చెరువులను సుందరీకరిస్తాం

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట, బాతుల చెరువులను పరిరక్షించి వాటిని సుందరీకరించేందుకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హయత్‌నగర మత్స్యపారిశ్రామిక సొసైటీ సభ్యులకు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులనే లబ్ధిదారులకు అందజేశారు.

మంత్రులకు ధన్యవాదాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని పేద ప్రజల సౌకర్యార్థం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రెండు ఆస్పత్రులను మంజూరు చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఎక్బాల్ బిన్ ఖలీఫా, కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డిలు మాట్లాడారు. మున్సిపాలిటీలో ఎక్కువగా పేదలు నివాసం ఉంటున్నందున ప్రభుత్వ ఆస్పత్రుల ఆవశ్యకతను మంత్రి సబితారెడ్డి, వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు తెలియజేశారు. స్పందించిన మంత్రి శ్రీరాంకాలనీలో యూపీహెచ్‌సీ, పహాడీషరీఫ్ 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారని చెప్పారు. దీంతో ఇద్దరు మంత్రులకు మున్సిపాలిటీ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, శ్రీరాంకాలనీలోని 16 కుల సంఘాలకు స్థలాలు కేటాయించి.. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కై సర్ బామ్, యూసుఫ్ పటేల్, జనార్దన్, హామెద్, నగేశ్, బర్కత్ అలీ, అలీ మసూరీ పాల్గొన్నారు.

ముగిసిన కేరళ తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, కేరళ రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న కేరళ తెలంగాణ హెరిటేజ్ ఫెస్టివల్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల సంస్కృతులను తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు కేరళ రాష్ట్ర నృత్య ప్రదర్శనలు నాటకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.



సైదాబాద్‌లో..



ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో..



వాసవి కాలనీలో ..

మహాత్ముడి బాటలో నడుద్దాం

అహింసను ఆయుధంగా చేసుకొని ఆంగ్లేయుల కబంధ హస్తాల్లోంచి మనదేశానికి విముక్తి కలిగించిన జాతిపిత మహాత్మాగాంధీకి పలువురు నివాళులర్పించారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముడు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ గాంధీ బాటలో నడవాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



నాగోలు చౌరస్తాలో..



కొత్తపేటలో..



మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ ..



గడ్డిఅన్నారంలో..



బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో..



వనస్థలిపురం గణేష్ టెంపుల్ వద్ద..



ఐఎస్‌సదన్‌లో..



చైతన్యపురి వికాస్‌నగర్‌లో..



జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయ ప్రాంగణంలో..



చంపాపేటలో..



ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో..

ఇసుక లారీల పార్కింగ్ కోసం 13 ఎకరాల కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఆటోనగర్‌లో ఇసుక లారీల పార్కింగ్ కోసం 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వనస్థలిపురం ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా వద్ద తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో 21 కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో లారీల పార్కింగ్ విషయమై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గత 20 సంవత్సరాలుగా ఆటోనగర్ వద్ద ప్రైవేటు వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో ఇసుక లారీల అడ్డాను నిర్వహిస్తున్నారని, దీంతో చుట్టు పక్కల ఉన్న 21 కాలనీల ప్రజలు ఇసుక, దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇసుక లారీల పార్కింగ్ కోసం ఆటోనగర్ లోపల గల టీఎస్‌ఐఐసీకి చెందిన 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తున్నామని అన్నారు. అట్టి పార్కింగ్ స్థలంలో ఎటువంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా లారీలను నిలుపు కోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లారీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూడిద నందారెడ్డి, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భవ’ను అందరూ సద్వినియోగం చేసుకోవాలి



బస్తీ మహిళలకు పథకం వివరాలు వెల్లడిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: అందరి ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి కోరారు. సోమవారం డివిజన్ పరిధిలోని సుబ్రమణ్యనగర్ కాలనీలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని పలువురికి ఆయుష్మాన్ భవ కార్డులు అందజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ బస్తీ మహిళలకు పథకం గురించి వివరాలు తెలియజేసారు. ఈ కార్డుల ద్వారా రూ. 5 లక్షల వరకు వైద్య సహాయాన్ని ఉచితంగా పొందవచ్చని తెలిపారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అరుణ, కాలనీ కమిటి సభ్యుడు ప్రసాదరావు, బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌బోర్డు ఉద్యోగుల సంక్షేమానికి కృషి



ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న ఉద్యోగులు

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డులో ఉద్యోగుల సంక్షేమానికి ఎంప్లాయీస్ యూనియన్ 24గంటల పాటు అందుబాటులో ఉండి వారికి అండగా నిలుస్తుందని వాటర్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. వాటర్‌బోర్డులో ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్నా బోర్డు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని సెక్షన్లు, అన్ని వాటర్‌బోర్డు కార్యాలయాల్లో ప్రతిరోజూ పర్యటించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌నాయకులు సి.రాజు, ఎ.ఉదయ్, ప్రేమ్‌కుమార్, శంకర్, శాల్‌మాన్ రాజు, బాలకిషన్, కొమురయ్య, సయ్యద్ షబ్బీర్, కృష్ణ, జె.శంకర్ పాల్గొన్నారు.

జైళ్లశాఖ సంస్కరణలతో నేరాల తగ్గుముఖం

చంచల్‌గూడ: క్షణికావేశంలో చేసిన తప్పుల వల్లే చాలామంది జైళ్లకి వస్తున్నారని హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ప్రేమావతి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా చంచల్‌గూడ పురుషుల జైల్లో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలతో సమాజంలో నేరాలు తగ్గాతున్నాయన్నారు. హైదరాబాద్ జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ మాట్లాడుతూ బెయిల్‌కు దరఖాస్తు చేసుకునే స్థోమత లేక జైళ్లలో మగ్గుతున్న ఖైదీలకు లీగల్ సెల్ సహాయసహకారాలు అందిస్తుందన్నారు. ఐజీలు యెర్రశెట్టి రాజేష్, మురళీ బాబు, ఐజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళ అరెస్ట్

హస్తినాపురం: గాంధీ జయంతిరోజున మద్యం దుకాణాలు మూసివేసి ఉండడంతో కొంతమంది కిరాణాషాపులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జలేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ గ్రామంలో కిరాణషాపులలో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నారన్న పక్కాసమాచారంతో సోమవారం ఇంజాపూర్ గ్రామపరిధిలోని తుల్జాభవానినగర్ కాలనీకి చెందిన కొర్ర శిల్ప (40) కిరాణ షాపుపై దాడిచేసి అందులో ఉన్న 33 మద్యం సీసాలను బాటిళ్లనును స్వాధీనం చేసుకుని శిల్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టాలి

చైతన్యపురి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగలను మోసం చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపయ్య మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కాజేసి దళిత బంధు పేరుతో దళితులను వారిలో వారు కొట్టుకునేలా ప్రభుత్వం ప్రవర్తిస్తుందన్నారు.

అవార్డు ప్రదానం

కాచిగూడ: వాసవి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ సింగర్ బేబి తాత లక్ష్మికి కాచిగూడ వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో వాసవి అవార్డును అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలను చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. తాత లక్ష్మిని ఈ సందర్భంగా అభినందించి ఘనంగా సత్కరించారు.

రాజకీయాల్లో స్వచ్ఛత రావాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్

చైతన్యపురి: ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో దేశ ప్రజలు స్వచ్ఛ భారత్‌లో భాగస్వామ్యమయ్యారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి తరుణ్‌చుగ్ అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా మోదీ స్వచ్ఛభారత్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని అన్నారు. రాజకీయాల్లోను, ప్రజల్లోను స్వచ్ఛత రావాలని తరుణ్ చుగ్ అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, స్థానిక బీజేపి నాయకులు జయప్రకాష్ , శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న గంగారామ్

చాదర్‌ఘాట్: రాష్ట్రంలో వికలాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వికలాంగుల హక్కుల ఎఫ్‌ఈడీ సంస్థ అధ్యక్షుడు మద్దెల గంగారామ్ పేర్కొన్నారు. సోమవారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో వికలాంగుల హక్కుల సాధన కుఫెడ్ అధ్యక్షుడు గంగారామ్ ఆధ్వర్యంలో శాంతియుత మౌన నిరాహారదీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, వికలాంగుల హక్కుల చట్టాన్ని తీసుకువచ్చి 6 సంవత్సరాలు అయినప్పటికీ ఇంతవరకు స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి



నాగోలు చౌరస్తాలో గాంధీ విగ్రహాని వినితిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

నాగోలు: అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని సిపిఐ మేడ్చల్ జిల్లా పార్టీ నాయకులు బోడుపల్లి కృష్ణ అన్నారు. సోమవారం నాగోలు చౌరస్తాలో సిపిఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కౌన్సిల్ సభ్యులు కందుల సుధాకర్ ఆధ్వర్యంలో నాగోలు చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని వినతిపత్రం అందజేశారు. అందరి దరఖాస్తులు పరిశీలించిన తరువాతే కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, మధు, శోభ పాల్గొన్నారు.

తెలంగాణ సైక్లింగ్ సంబరాలు..

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఉప్పల శ్రీనివాస్‌గుప్త



టార్గెట్ సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్త

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం టార్గెట్ సైక్లింగ్ ఛాంపియన్స్ ఫౌండేషన్ నిర్వాహకులు నాగరాజు కొత్తపల్లి ఆధ్వర్యంలో గాంధీ జయంది సందర్భంగా నాగోలు బండ్లగూడలో నిర్వహించిన తెలంగాణ సైక్లింగ్ సంబరాలు టార్గెట్ సైక్లింగ్ పోటీలను ఉప్పల శ్రీనివాస్‌గుప్త సైకిల్ ర్యాలీని ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో టార్గెట్ సైక్లింగ్ ఛాంపియన్స్–2023 13 సంవత్సరాల బాల బాలికలకు సైక్లింగ్ పోటీలు నిర్వహస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సైక్లింగ్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఎల్‌బీనగర్ నూతన కమిటీ ఎన్నిక



మన్సూరాబాద్: ఎంఆర్‌పీఎస్– టీఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు ద్యావని నర్సింహ్మా ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్–టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంతం ఉపేందర్, ఇన్‌చార్జిగా కర్నాటి జగదీష్, ఉపాధ్యక్షులుగా నల్ల నాగరాజు, అనంత నర్సింహ్మా పాల్గొన్నారు.

చంచల్‌గూడలో జూనియర్ కాలేజీకి శంకుస్థాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్, ఎమ్మెల్యే బలాల

చంచల్‌గూడ: చంచల్‌గూడలో జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే బలాల సోమవారం శంకుస్థాపన చేశారు. బావి తరాలకు నాణ్యమైన విద్య అందించేందుకు నూతన భవనాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలి

- ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత



డాక్టర్స్ కాలనీలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గోపాల్

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గంలోని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఇస్కాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం డాక్టర్స్ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారుల పేర్లతో కూడిన వినతి పత్రం ద్వారా అందజేశారు. సీపీఐ శాఖ కార్యదర్శి మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్ మాట్లాడుతూ.. ప్రజల కనీస మౌలిక వసతులు, సొంతింటి నిర్మాణాలకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో వేలాది మంది నిరుపేదలు ఇళ్లు లేక దశాబ్దాల తరబడి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మహమూద్, ఐ.పాపయ్య, శంకర్‌నగర్, జిల్లెల కృష్ణ, ఆర్.కరుణాచారి, మహ్మద్ ఫైమిదా, ఎస్.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.